క్లుప్తంగా

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



పాతపాడు(విజయవాడరూరల్): జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పాతపాడు గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలను అందజేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు తెలిపారు. ఎస్టీ కాలనీలో తడిచెత్త, పొడిచెత్త బుట్టలను పంచాయతీ సిబ్బంది సోమవారం పంపిణీచేశారు. శివారు గ్రామాలైన వెంకటాపురం, అప్పారావు పేటలనూ ప్రతి ఇంటికీ చెత్త బుట్టలు అందజేస్తామని చెన్నకేశవరావు తెలిపారు.

కట్నం కోసం వేధింపులపై కేసు

పెనమలూరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఓ భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. మండలంలోని వణుకూరు దళితవాడకు చెందిన కత్తి జ్యోతికి 2011లో లారీ డ్రైవర్ నాగేంద్రబాబుతో వివాహమైంది. పెళ్లి సమయంలో జ్యోతి తల్లిదండ్రులు అల్లుడికి కట్నకానుకలు ఇచ్చారు. జ్యోతి, నాగేంద్రబాబుకు ఇద్దరు పిల్లలు జన్మించారు. నాగేంద్రబాబు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అమ్మవారికి ఆషాఢం సారె

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలంలోని దంటగుంట్ల, కె.సీతారామపురంలో గ్రామ దేవతకు సోమవారం ఆషాఢం సారె సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి సారె తీసుకుని మేళతాళాలతో జై దుర్గా నామస్మరణతో గంగానమ్మ తల్లి దేవస్థానం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ ఎదురువాడ శ్రీనివాసరావు, ధర్మ ప్రచారక్ యడ్లపల్లి పాండురంగారావు, నానిబాబు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి పూజలు



పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, ఏకాదశరుద్రాభిషేకం, స్వామికి ప్రత్యేక అలంకరణ జరిగాయి. పార్వతి తల్లికి కుంకుమ పూజలు చేశారు. ఈ నెల 13వ తేదీన శ్రీరామలింగేశ్వరస్వామికి 108 కిలోల నేరేడు పండ్లతో అభిషేకం చేస్తారు. 14వ తేదీన ఉదయం పార్వతి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె సమర్పిస్తారని ఈఓ గంగాధరరావు తెలిపారు.

సర్వీసు రోడ్డులో నిలిచిన బస్సు



కంకిపాడు: సర్వీస్ రోడ్డులో బస్సు నిలిచిపోవడంతో రాకపోకలు సజావుగా సాగక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి మార్గంలో కంకిపాడు వద్ద బైపాస్ నిర్మించారు. ఇందులో భాగంగా రాకపోకలకు వీలుగా కంకిపాడు ప్రధాన పట్టణానికి వెళ్లే వాహనదారుల సౌకర్యం కోసం సర్వీసురోడ్డు ఏర్పాటుచేశారు. సోమవారం ఉదయం ఈ మార్గంలో వెళ్తున్న సిటీ బస్సు ఇంజినులో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా నిలిచిపోయింది. దీంతో సర్వీసు రోడ్డు మీదుగా ద్విచక్రవాహనాలు మినహా ఇతర వాహనాలు ఏవీ రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. మధ్యాహ్నం సమయంతో ఇంజిను మరమ్మతులు పూర్తికావటంతో బస్సు ముందుకు కదిలింది. దీంతో రాకపోకల పునరుద్ధరణ జరిగింది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్

గన్నవరం: కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సంబంధిత సేవల పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చేవారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అర్హతే ప్రామాణికంగా, ఎవరి సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. ఏవైనా కారణాలు వల్ల అర్హత సాధించని వారికి మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, పడమట రంగారావు, ఎంపీడీఓ సత్యకుమార్, ఈఓ సత్యబాబు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామ సచివాలయం-3 పరిధిలోని రోటరీ ఆడిటోరియంలో కూడా జగనన్న సురక్ష శిబిరం జరిగింది.



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ



ఆత్కూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యం

ఉంగుటూరు: చిన్న సాంకేతిక కారణంతో అర్హులు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీపీ సరోజిని పేర్కొన్నారు. మండలంలోని ఆత్కూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం జరిగింది. 380 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ మొబైల్ లింక్ ధ్రువీకరణ పత్రాలు 58 మందికి అందజేశారు. ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, ఎంపీటీసీ సభ్యులు మేరీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ గాలీబ్, ఈఓఆర్డీ బాషా, కార్యదర్శి సాయిబాబు, సచివాలయ కన్వీనర్ శోభనాద్రి పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలు అందించాలి

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సూచించారు. కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై ఆయాశాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ.. మట్టి నమూనాల సేకరణ సమర్థంగా జరగాలన్నారు. మండల పరిషత్‌సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో బాధ్యతతో ఉండాలన్నారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు, మెరుగైన సేవలు అందాలనే లక్ష్యంతో పరిపాలన సాగిస్తోందని పేర్కొన్నారు. ఏ ఒక్కరి నిర్లక్ష్యం వల్లా అర్హులకు నష్టం జరగకూడదని స్పష్టంచేశారు. ప్రతి ఒక్క పథకంపైనా ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నారు. సమావేశాలు, గ్రామ పర్యటనల్లో వచ్చిన సమస్యలను నమోదు చేసుకుంటూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించటంలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో సమావేశాలు, గ్రామ పర్యటనల వల్ల ఫలితం ఉండదన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. వర్షాకాలం కారణంగా నీటి కలుషితం, ఆరోగ్య సమస్యలు అధికమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేలా చర్యలు సమర్థంగా తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. అభివృద్ధి పనులను వేగం చేసి, ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతుల కల్పనకు అందరి సమష్టి కృషి అవసరమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ.. సబ్సిడీ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఉమెన్‌ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, ఈఓపీఆర్‌డీ పి.వి.ఎస్.మైథిలి తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు మండల పరిషత్ సమావేశంలో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

సీఐ కార్యాలయం నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాజశ్రేయస్సుకు ఇతోధికంగా విరాళాలు అందిస్తున్న పారిశ్రామికవేత్త అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం దాతృత్వం అభినందనీయమని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో నిర్మిస్తున్న పోలీస్ సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణానికి అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని బాపులపాడు మండలం బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదగా భవన నిర్మాణ కమిటీ సభ్యుడు, సీఐ అల్లు నవీన్‌నరసింహామూర్తికి సోమవారం అందించారు. గతంలోనూ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం బొమ్ములూరు, కొయ్యూరు గ్రామాభివృద్ధికి తనవంతు ఆర్థికసాయాన్ని అందించారని ఎమ్మెల్యే వంశీ కొనియాడారు. దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ డైరెక్టర్ అడుసుమిల్లి చైతన్య వాసు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు, హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదుగా విరాళం అందిస్తున్న అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం

ముస్తాబాద పీహెచ్‌సీ ప్రారంభానికి సిద్ధం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామంలో ప్రభుత్వం రూ.1.82 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ భవనాన్ని ఈ నెల 13వ తేదీన ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ భవనాన్ని 15 గదులతో నిర్మించారు. గతంలో ఉన్న పాత భవనం స్థానంలో డాక్టర్లకు మూడు గదులు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, స్టాఫ్ నర్సుల గది, డ్రెస్సింగ్ రూమ్, మేల్, ఫిమేల్ వార్డులు సిద్ధమయ్యాయి. ఇప్పటి వరకూ దాతలు వితరణగా ఇచ్చిన ఇంటిలో పీహెచ్‌సీని నిర్వహిస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 13 మంది ఎంఎల్‌హెచ్‌పీలు ఆయా గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నారు. 43 మంది ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో ప్రజారోగ్యం కాపాడేందుకు కృషి చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఆయుష్ విభాగం సేవలు సైతం రోగులకు ఉచితంగా లభించనున్నాయి. ముస్తాబాద పీహెచ్‌సీ ద్వారా ఈ ప్రాంత ప్రజానీకానికి ప్రభుత్వ ఆశయం మేరకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద బాబు అన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

ఉంగుటూరు: డీలర్లు తప్పనిసరిగా ఈ పోస్ యంత్రం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని గన్నవరం ఏడీఏ సునీల్ స్పష్టంచేశారు. ఉంగుటూరులోని ఆర్‌బీకేలో మండలంలోని ఎరువుల డీలర్లు, పీఏసీఎస్ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ రశీదు ఇవ్వాలన్నారు. లైసెన్స్ గడువు పూర్తయిన వారు రెన్యూవల్ చేసిన తరువాతే ఎరువులు విక్రయించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. స్టాక్ రిపోర్టును ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఏఓ హరీష్‌కుమార్, ఏఈఓ దుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె వాయిదా

పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీలో సోమవారం జరగాల్సిన సమ్మెను సమస్యలు పరిష్కారం కావడంతో వాయిదా వేశామని సీఐటీయూ మునిసిపాలిటీ శాఖ గౌరవ అధ్యక్షుడు ఉప్పాడ త్రిమూర్తి, ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావుకు సమ్మె వాయిదా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కార్మికులకు సమాన పనికి సమాన వేతనంతో పాటు ఆరోగ్య అలవెన్స్ కూడా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వివిధ పరికరాలు అందజేశారని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సంబంధించి కార్మికుల వివరాలు నమోదు చేశారని వివరించారు. సంఘ సభ్యులు రత్నకరుణ, దోమ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారం అవుతున్నాయని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. పెనమలూరు సచివాలయం-1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాతినేని మాట్లాడుతూ.. ప్రజల చెంతనే పాలన అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాలు, వలంటీర్లతో ప్రజల సమస్యలు తీర్చడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను అధికారులు గ్రామాల్లోకి వచ్చి పరిష్కరిస్తున్నారని వివరించారు. సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ.. జగనన్న సురక్షతో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం దొరికిందన్నారు. ఈ సందర్భంగా 501 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏఓ లోయ శివశంకర్, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన పాలనకు జగనన్న సురక్ష

ఉయ్యూరు: మెరుగైన పాలన కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. మండలంలోని గండిగుంట సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 579 మందికి 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష చేపట్టిందన్నారు. సర్పంచ్ గెత్తం అనుపమ, ఎంపీటీసీ బందెల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గెత్తం విజయ్‌కుమార్, నందం జోగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనమలూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న తాతినేని పద్మావతి, సర్పంచి భాస్కరరావు



గండిగుంటలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆర్య వైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రామవరప్పాడు: ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. రామవరప్పాడు బల్లెంవారి వీధిలో సోమవారం వాసవీ సేవా సంఘం, వర్తక సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో వాసవీ సేవా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వైఎస్సార్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ గ్రామాల్లో వ్యాపార లావాదేవీలు ఎలా ఉన్నాయో వర్తక వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వర్తకులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. వాసవీ సేవా సంఘం అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు, శిఖాకొల్లి యల్లమందయ్య, కోటా రామకృష్ణ, మాదల వెంకటరమేష్, కిరణ్, వర్తక సంఘం అధ్యక్షుడు ఉరిమి సుబ్రహ్మణ్యం, గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం



పెనమలూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు



ఉయ్యూరు సెంటరులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



గన్నవరంలో పవన్ చిత్రపటాలను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

పెనమలూరు: తమపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పెనమలూరులో సోమవారం వలంటీర్లు నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లడుతూ.. మహిళలపై పవన్‌కల్యాణ్‌కు కనీస మర్యాద లేదని విమర్శించారు. తాము అందించిన సేవల్లో పవన్‌కల్యాణ్ ఒక్క శాతమైనా ప్రజలకు అందించారా అని ప్రశ్నించారు. తమపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని, లేని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ సేవలను దేశ ప్రధాన మంత్రి సైతం కొనియాడారని, ఇతర రాష్ట్రాలు కూడా ప్రశంసించాయని గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్ తన వైఖరి మార్చుకోని పక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వలంటీర్లు జోజికుమార్, తంభా నాగిని, రాణి, కె.స్వాతి, మరీదు సింధు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు జీవన్, మందూరు కోటేశ్వరరావు, మాదు శ్రీనివాసరావు, తెన్నేటి ప్రకాష్ సంఘీభావం పలికారు.

భగ్గుమన్న వలంటీర్లు

ఉయ్యూరు: తమ మనోభావాలను దెబ్బతీసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. ఉయ్యూరు పట్టణంతోపాటు పలు గ్రామాల్లో నిరసనలు చేశారు. పవన్ వ్యాఖ్యలతో ప్రచురితమైన కథనాల ప్రతులను దగ్ధం చేశారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులో సోమవారం సాయంత్రం వలంటీర్లు ధర్నా చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ నిస్వార్థ ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. మహిళల మనోభావాలు, వ్యక్తిత్వం కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసి మహిళలపై తనకు ఉన్న కుంచిత భావాన్ని పవన్ వ్యక్తపరిచారని మండిపడ్డారు. వెంటనే పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, మహిళా లోకానికి, వలంటీర్లకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో వలంటీర్లు పవన్ వ్యాఖ్యలపై నిరసన తెలిపారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

గన్నవరం: తమను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం స్థానిక పాతగన్నవరంలోని గ్రామ సచివాలయం-3, ఎస్సీ కాలనీలోని గ్రామసచివాలయం-4 వద్ద వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేయడంతో పాటు పవన్‌కు వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ కైలే శివకుమార్ మాట్లాడుతూ.. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కు తీసుకుని భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెనమలూరు: పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజేష్ కథనం మేరకు.. మండలంలోని గోసాల వైకుంఠపురంలో పేకాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.4,200 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

స్విమ్మింగ్‌లో సెయింట్‌జాన్స్ విద్యార్థికి పతకాలు

గన్నవరం: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ హై స్కూల్ విద్యార్థి పి.రామచంద్రరావు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. పాఠశాలలో రామచంద్రరావు అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తేదీల్లో నరసరావుపేటలో పల్నాడు జిల్లా ఆక్వటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు జరిగాయన్నారు. 100 మీటర్ల జూనియర్ కేటగిరిలో రామచంద్రరావు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, 50 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అనంతరం రామచంద్రరావును ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ బ్రదర్లు జిమ్మికురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

గన్నవరం: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. స్థానిక రాయ్‌నగర్‌లోని కల్యాణ మండపంలో సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం రెండో రోజు కూడా కొనసాగాయి. ముఖ్య అతిథి మూర్తి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. విదేశాల్లోని నల్లధనం తీసుకొచ్చి ప్రజలకు పంచుతామని ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజాస్వామ్యవాదులతో కమ్యూనిస్టు పార్టీలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్యామ్ సుందరం, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు తాతయ్య, ప్రసాద్, పిచ్చియ్య, పెద్ది వాసుదేవరావు పాల్గొన్నారు.

98 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: కంటిని నిర్లక్ష్యం చేయొద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. ఈడుపుగల్లు ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 98 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. దృష్టిలోపాలు ఉన్న పలువురికి కళ్లజోళ్లు అందించేందుకు సిఫారసు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ రుహాన్సీ, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్తలు ఐఎస్‌బీఎన్ కుమారి, దుర్గమ్మ, స్వరూప, స్వర్ణ, బి.స్వరూప పాల్గొన్నారు.